

# నందిని

అక్కిరాజు భట్టిప్రోలు

పండగ. సంబరం. ఆనందం. పట్టలేని విజయోత్సాహం. ఒకళ్లనొకళ్లు కౌగిలించుకుంటున్నారు, అభినందించుకుంటున్నారు. కోలాహలం. కోల్పోయిన సాయంత్రాలూ, నిద్రలేని రాత్రులూ ఎన్నని? రెండున్నరేళ్ల గొడ్డుచాకిరీకి గుర్తింపు. ప్రతిఫలం.

తన ఆఫీసుగదిలో కుర్చీలో జారగిలబడి ఉంది నందిని. ఆమె చేతుల్లో అటూ ఇటూ మారుతూ ఎర్రటి మెత్తటి బంతి. బల్లమీద కంప్యూటర్లు రెండూ పనిలేక సోమరుల్లా స్క్రీన్‌సేవర్లని ఎగరేస్తున్నాయి. మారుతున్న బంతి మీద అందమైన కంపెనీ పేరు, లోగో! ఆ లోగో మరింత అందంగా కనబడింది నందినికి. చిన్న చిరునవ్వు.

"హే మిలియనీర్..." అంటూ వచ్చాడు మార్క్.

"రెండువందల మంది మిలియనీర్లం తెలుసా మనం ఇప్పుడు," అన్నాడు ఎదురుగా కుర్చీలో కూలబడుతూ. అతడి నెత్తిన అంతా కలిసి షాంపేన్ గుమ్మరించారు పొద్దున. వెళ్లి స్నానం చేసి వచ్చాడు. అయినా ఇంకా షాంపేన్ వాసన పూర్తిగా పోలేదు.

"నాకింకా నమ్మకం కలగట్లేదు," అంది నందిని.

"అందరి పరిస్థితీ అలానే ఉంది... అవునూ, సాయంత్రం పార్టీకి నీ కార్లో వస్తాను, మరిచిపోకు. వెనక్కి వచ్చేటప్పుడు నేను స్పృహలో ఉండనేమో!" అన్నాడు.

"అలాగే. అయితే ఇప్పుడే పద, ఇంక ఆఫీసు వదిలేద్దాం. ఇంటికి వెళ్లి ఇండియాకి ఫోన్ చెయ్యాలి. అలాగే స్నానం కూడా చేసి అక్కణ్ణించే పార్టీకి పోవచ్చు," అంది నందిని.

"ఒక్క అయిదు నిమిషాలు" అంటూ వెళ్లాడు మార్క్ తన బ్యాగ్ తెచ్చుకోవడానికి.

అరగంటలో నందిని ఇంట్లో ఉన్నారిద్దరూను. అదో సింగిల్ బెడ్రూం అపార్టుమెంట్. నందిని ఒంటరి జీవితానికి స్థావరం. ఆఫీసుకి వెళ్లినట్టే ఉంటుంది మార్క్‌కి నందిని ఇంటికి రావటం. ఎన్నో ప్రాజెక్టు నిర్ణయాలు కూడా ఈ ఇంట్లోనే తీసుకున్నారు. ఎన్నోసార్లు తెల్లవారుఝామున నాలుగింటికి ఆఫీసు నుంచి నందినితోపాటు ఈ ఇంటికి వచ్చి సోఫాలో పడుకుని పొద్దున్నే లేచి మళ్లీ ఆఫీసుకి వెళ్లడం అతగాడికింకా గుర్తే.

"మిలియనీర్! ఇంక నువ్వు మంచి ఇల్లు కొనాలి," అన్నాడు మార్క్ అలవాటు ప్రకారం సోఫాలో కూలబడి, టీవీ రిమోట్ చేతిలోకి తీసుకుంటూ.

"తప్పకుండా. కాకపోతే, ఒంటరిగా బోరుకొడ్తుందేమో ఇంతకంటే పెద్ద ఇంట్లో," అంటూ సమాధానం కోసం ఎదురుచూడకుండా లోపలికి నడిచింది.

ఫోన్ చేతిలోకి తీసుకుని ఓ నిమిషం ఆలోచించింది. మాటలకోసమో, మరి దేనికోసమో తడుముకుంటున్నట్టుంది. ఏం చెప్పాలనో, ఏం వినాల్సొస్తుందనో?

ఇంటి నెంబర్ డయల్ చేసింది.

"నాన్నా నేను."

"నందూ! చెప్పమ్మా," తండ్రి గొంతులో రెండు ఫోన్ల మధ్య ఉన్న దూరం తెలుస్తోంది.

"నాన్నా, గుడ్ న్యూస్! చివరికి మా కంపెనీ పబ్లిక్‌కి వెళ్లింది. రెండుసార్లు వాయిదా పడింది ఇప్పటికి. ఈసారి మాత్రం నిజంగా ఓపెన్ అయ్యింది. ఇవ్వాళ చూడాలి, ఓపెన్ అవటంతోనే ఎట్లా అంకెలు మారాయనుకున్నావ్... అందరం అలా టీవీ చూస్తూ కూర్చుండిపోయాం. ముందునించీ అనుకుంటూనే ఉన్నాం కానీ, మరీ ఇంతలా మార్కెట్ రియాక్ట్ అవు

తుందనుకోలేదు. ఆఫీసులో మా మొహాలు చూడాలి. ఎందుకూ, ఎప్పటికీ పనికిరావేమోననుకున్న ఆప్షన్లన్నీ ఇప్పుడు బంగారం ముక్కలు తెలుసా... హల్లో నాన్నా వింటున్నావా?...'' గుక్క తిప్పుకోకుండా చెపుతోంది నందిని.

''వింటున్నానే, మొత్తానికి సాధించావు. నాకేం పెద్ద ఆశ్చర్యంగా లేదు. నీకేమన్నా అనుమానంగా వుండిందేమోగానీ, నేనయితే అనుకుంటూనే ఉన్నాను. మీరు పడుతున్న కష్టం తెలిసినవాణ్ణి కాబట్టి, ఫలితం లేకుండా ఉండదని అనుకుంటూనే ఉన్నాను. బద్ధ కస్తులూ, పిరికివాళ్లూ ఓడిపోతారు కానీ, కష్టపడేవాళ్లూ, సాహసవంతులూ గెలిచేదాకా పనిచేస్తూనే ఉంటారు.''

''చాల్లే నాన్నా నీ థియరీలు... ఇప్పుడు నా ఆప్ష న్లెంత విలువ చేస్తాయో తెలుసా? అమ్మో! లెక్కెయ్య డానికి కూడా భయమేస్తోంది. బహుశా నేనిప్పుడు ఉద్యోగం మానేసినా మరో రెండు తరాలు కూర్చుని తినొచ్చు.''

''సరే ఓ ఏసీ కారు కొనివ్వు నాకు,'' నందిని తండ్రి...

''ఎన్ని కావాలో చెప్పు, కొనేద్దాం! సరే అమ్మేం చేస్తోంది?''

నందినికి తెలుసు, ఏసీకార్లూ, బంగళాలూ ఏవీ తండ్రిని అంతగా ఆనందపరచలేవని.

''ఇదిగో పక్కనే ఉంది. నువ్వేదో ఘనకార్యం చేశావని అప్పుడే అర్థమయినట్టుంది. లాక్కుంటోంది ఫోను,'' తండ్రి.

''నందూ, నందూ...'' తల్లి గొంతు.

''అమ్మా నీకేం కావాలే.''

''నాకేం కావాలి? ఇంతకీ ఎంత వెనకేశావ్? ఇక నన్నా తిండీ తిప్పలూ లేకుండా ఆ గొడ్డుచాకిరీ తప్ప తుందా?''

''అమ్మా ఏ కష్టం పడకుండా అన్నీ కావాలంటే ఎట్లాగే?''

''ఏవెూనమ్మా ఏవో కావాలని కష్టపడ్డావటే నువ్వు?''

నందిని ఆలోచనలోపడింది. 'ఒక్క డబ్బు కోసమే ఇంత కష్టపడ్డానా,' అని. కంపెనీలో చేరిన మొదటి పదిమందిలో ఆమె ఒకర్తి. తానూ, మార్క్ డెవలప్ మెంట్ లీడ్ తీసుకున్నప్పట్నించీ మొత్తం డెవలప్‌మెంట్ పద్ధతి మార్చేసి ఇక్కడిదాకా పట్టుకొచ్చారన్న గుర్తింపు ఉందనీ ఆమెకు తెలుసు. అడగక్కర్లేకుండానే ఆమె ఖాతాలో కుప్పలు కుప్పలుగా ఆప్షన్లని పోశారు. ఆగి చూసుకునే అవసరం కానీ, సమయం కానీ ఆమెకు లేకపోయినాయి. ఆమె దృష్టంతా ఒక్కదాని మీదే ఉండింది. సంవత్సరంలోపు కంపెనీ పబ్లిక్‌కి వెళ్లకపోతే ఏదో ఒక పెద్ద చేప మింగేస్తుంది... లేదా పూర్తిగా మూత పడుతుంది.

''ఏవో కావాలని కాకపోయినా, ఏవీ లేవంటే కష్టపడతామా?'' నందిని ఆలోచిస్తున్నట్టుగా అంది.

''ఇంక ఆ ఒక్కటీ మిగిలిపోయింది. అదిగూడా ఎలాగోలా అయిపోతే ఇక నీ గురించి దిగులుండదు.''

''ఏ ఒక్కటీ?'' మామూలు రోజుల్లో అయితే నందినికి అర్థమయే ఉండేది, ఆ ఒక్కటీ ఏమిటో.

''ఇంకేమిటి... ఏదో ఓ సంబంధం చూసుకుని పెళ్లి చేసుకుంటే సరి,'' కొంత సంశయిస్తూనే అంది.

''అమ్మా!'' అరిచినట్టుగా అంది నందిని.

''నూటికి తొంభైతొమ్మిది మంది ఇండియా నుంచి వచ్చే ఇంజనీర్లు సాధించాలనుకుని సాధించ లేనిది నేను సాధించానని చెప్పటానికి ఫోన్ చేశాను. నా పెళ్లి సంగతి ఇప్పుడెందుకు ఎత్తుతావు? అదొక్కటీ నేనేదో సాధించలేకపోయినట్టు.''

''సాధించటం ఏంటే... అది కూడా ఓ అవసరమే కదటే.''

''నా మూడంతా పాడు చేశావు. మళ్లీ ఫోన్ చేస్తా. ఆఫీసు పార్టీ, పెద్ద హోటల్లో, పెద్ద సెలబ్రేషన్... బై,'' సమాధానం కోసం ఎదురుచూడకుండా ఫోన్ పెట్టేసింది నందిని.

వచ్చిన కోపాన్ని అదుపు చేసుకోడానికి ఓ నిమిషం అలాగే కదలకుండా కూర్చుంది. మెల్లగా లేచి, ముందు గదిలో మార్క్‌కి వినబడేలా అరిచింది, ''టీవీ చూస్తుండు, త్వరగా స్నానం చేసొస్తా,''నంటూ.

వంటిమీద వేణ్ణీళ్లు పడడంతో పొద్దుట్నించీ వున్న ఉద్వేగం, ఇప్పుడే వచ్చిన కోపం అన్నీ తగ్గి విశ్రాంతి దొరికినట్టనిపించింది. కానీ ఆలోచనలు ఆగుతాయా?

## 2

నందినికి బాగా గుర్తు. తన జీవితానికి ఓ ఇద మిద్ధమయిన ఆలోచన ఏర్పడిన రోజది. ఫైనల్ సెమి స్టర్ ప్రాజెక్ట్ రోజులు. చదువుకంటే, చదువు తర్వాత ఏమిటని ఎక్కువగా ఆలోచించే రోజులు. క్యాంపస్ ఇంటర్వ్యూలూ, అప్లికేషన్లూ, జి.ఆర్.ఈలూ, టోఫెల్లూ, ప్రేమలూ, ప్రపోజల్లూ, పెళ్లిచూపులూ, ముహూర్తాలూ...

లాబ్ నించి కాంటీన్‌కి నడుస్తోంది నందిని.

''నందూ... నీకో సర్‌ప్రైజ్ న్యూస్...'' అంటూ ఎదురయ్యింది క్లాస్‌మేట్ మాధవి.

''ఏమిటే అంత పెద్ద సర్‌ప్రైజ్?'' అంది నందిని.

"ఇది చూడు," అంటూ బేగ్‌లోంచి ఓ రెండు పిన్ చేసిన పేపర్లు తీసి, దగ్గర్లో ఎవరూ లేరని నిర్ధారించుకుని నందిని చేతిలో పెట్టింది.

ఆశ్చర్యంగా చూసింది నందిని. ఆ రెండు పేజీల పైన ఆమెదే కలర్‌ఫోటో, ఆకుపచ్చ పట్టుచీరలో. "ఎంత అసహజంగా ఉంటాను చీరలో," అనుకుంది. రాధా వాళ్ల అక్క పెళ్లికి క్లాస్‌మేట్స్ అందరూ పట్టుచీరలు కట్టుకు వెళ్లాలని సరదాపడి వెళ్లినప్పుడు రాధ తీయించి ఇచ్చిన ఫోటో అది. పెళ్లి ఫోటోగ్రాఫర్‌తో క్లాస్‌మేట్స్ అందరికీ విడివిడిగా ఫోటోలు తీయించింది రాధ. అందరికీ ఫోటో నెగెటివ్ కూడా ఇచ్చి, పెళ్లిచూపులకి వాడుకోండని చెప్పింది.

ఆ ఫోటో పైకెత్తి చూసింది నందిని. అదో పెళ్లి రెస్యూమ్. మొదటిపేజీలో ఆమె ఎత్తు, రంగు, చదువు, ఇంజనీరింగ్ రాంకు, వచ్చిన స్కాలర్‌షిప్పులూ అన్నీ వివరంగా ఉన్నాయి. 'దీనికిది ఇలాగ టిసిఎస్‌కి పంపించొచ్చు,' అనుకుంది. రెండోపేజీలో ఆమె జాతకచక్రం. అదెక్కణ్ణించి వచ్చిందో ఎవరు తయారుచేశారో ఆమెకి తెలీదు.

"ఇదెక్కడిది నీకు," అంది నందిని ఇంకా నమ్మలేనట్టుగా.

"మా అన్నయ్యకి వచ్చిన సంబంధాల్లో ఇదొకటి. నిన్న మధ్యాహ్నం పోస్టులో వచ్చింది. అన్నీ నేనే తీసి ఫైల్ చేసి మా నాన్నకిస్తాను. ఇది చూడగానే మతిపోయింది నాకు," మాధవి.

"ఇది నిజంగానే పెద్ద సర్‌ప్రైజ్. నాన్న సంబంధాలు చూడనా అంటే సరేనన్నాను. ఎవరైనా సరిపడిన పెళ్లికొడుకు దొరికితే అలాగేనన్నాను. ఇదంతా ఎప్పుడో నాలుగునెల్ల క్రితం సంగతి. తర్వాత మా నాన్న ఏమ్మాట్లాడలేదు. నేనూ ఏమడగలేదు. సంబంధాలు చూడ్డం అంటే ఇలా బయోడేటాలు ఊరంతా పంచుతారనుకోలేదు."

"లేదే... ఇదేదో మారేజ్‌బ్యూరో నించి వచ్చింది. బహుశా మీవాళ్లు అందులో రిజిస్టర్ చేసి ఉంటారు."

"అయ్యుండాలి," అంది నందిని ఆలోచిస్తూ.

"నందూ, ఏమనుకోకు నిజం చెప్పేస్తాను. మా అన్నయ్య సంబంధం మాత్రం మర్చిపో," చెప్పలేనట్టుగా కొంచెం కష్టపడుతూ చెప్పింది.

నందిని ఒక్కసారిగా నవ్వింది.

"ఎందుకే నువ్వంత భయపడతావు? నేనేమీ మీ అన్నతో పెళ్లిని ఊహించుకుని కలలు కనెయ్యట్లేదు. ఇలాటి రెస్యూమ్ ఒకటి తిరుగుతోందనే నాకు తెలీదు. ఇక మీ అన్న గురించి నాకు తెలిసింది సున్నా."

"అదికాదే. నీతో స్నేహం చెడటం ఇష్టంలేదు. అందుకే నేనే హడావిడిగా మనమధ్యనించి దీన్ని తప్పించే ప్రయత్నం చేస్తున్నాను. మా అన్న మగాడు! అంటే తెలుసుగా ఇంజనీరింగ్ చేసి, పెసరట్టుప్మా చేసే ఐశ్వర్యారాయి కావాలి వాడికి," అంది మాధవి.

నందిని పడీపడీ నవ్వింది, మాధవి చెప్పిన తీరుకి.

కానీ నందినికి తెలుసు. తను ఇంజనీరింగు చేస్తోంది, పెసరట్టుప్మా కూడా చేయగలదు. కానిదల్లా తాను ఐశ్వర్యారాయి!

ఇద్దరూ పెళ్లిళ్లూ సంబంధాల గురించి మాట్లాడుకుంటూ కాంటీన్‌కి చేరారు. మాధవి ఇద్దరికీ చాయ్ తీసుకొచ్చింది.

"ఓ మాట చెప్తాను ఏం అనుకోవుగా," అంది.

నందినితో తనకున్న స్నేహానికి అలా అడగక్కర్లా. అలా అడిగిందంటే ఆమెకే తెలుసన్న మాట, నందినికి నచ్చని విషయమే చెప్పబోతున్నానని. అలాంటప్పుడు చెప్పడం ఎందుకు?

నందిని తలెత్తి చూసింది.

"నీకు సరైన సంబంధం, నువ్వు కోరుకున్నట్టుగా ప్రొఫెషనల్‌తో కావాలంటే ఇలా లాభంలేదు. నువ్వు నా మాట విని సర్జరీ చేయించుకో. మొహమ్మీద మచ్చలు ఈజీగా తీసేయొచ్చు."

నందిని ఏదో అనబోయి తమాయించుకుంది.

మాధవి తన శ్రేయోభిలాషి అని ఆమెకి తెలుసు. నిజాన్ని చెప్పిందే తప్ప అవమానించే ఉద్దేశం లేదని సమాధానపడింది.

కోపాన్నీ, ఆవేశాన్నీ మింగేయడానికి కాస్త టైం పట్టింది నందినికి. మెల్లిగా అంది...

"మొహమ్మీద మచ్చలకి ప్లాస్టిక్ సర్జరీ. తర్వాత? బ్రెస్ట్ ఇంప్లాంట్ చేయించుకోవాలా... ఇవి సరిపోతాయా? దాంతర్వాత నడుం సన్నగా... ఇంకా ఏమేం చేయించుకోవాలే పెళ్లి కోసం? కాని నాకు తెలిసిన పెళ్లికొడుకులెవరూ పెళ్లి కోసం ఇన్ని తంటాలు పడ్డం చూళ్లేదు. సరే విషయం వచ్చింది కాబట్టి ఇక నేనేదో ఓ నిర్ణయం తీసుకోవాలి. అందం గురించి నాకు తెలీదు. నా మట్టుకు నాకు ఆరోగ్యమే అందం. నా ఆరోగ్యానికేమీ కాలేదు."

"నందూ, కోపం తెచ్చుకోకు, బాధపడకు. నీకేం కావాలో నిర్ణయించుకోమని చెపుతున్నాను. నీకు కనీసం చదువన్నా ఉంది. నీ సంపాదన చూసైనా చేసుకునే వాళ్లుంటారు. గవర్నమెంట్ ఉద్యోగస్తుల్లో, బ్యాంకు ఉద్యోగాలు చేసేవాళ్లో పర్లేదంటే నీ ఇష్టం. ప్రొఫెషన్

కావాలీ, అమెరికా ఆస్ట్రేలియాలూ కావాలంటే మాత్రం నువ్వూ అందరిలానే నడవాలి. పెళ్లి పెటాకులూ అక్కర్లేదనుకుంటే మాత్రం నీ ఇష్టం. ప్రాక్టికల్‌గా ఉండమంటున్నాను. రెస్యూమ్‌దాకా వచ్చింది కాబట్టి చెపుతున్నాను... ఈ ఆటలో రూల్స్,'' అంది మాధవి. నందినికీ తెలుసు మాధవి మాట్లాడిందంతా నిజమేనని.

''మధూ, నిజం చెప్పాలంటే పెళ్లి గురించి ఇంత వరకూ నేను కూడా ఇంతలా ఆలోచించలేదు. నువ్వు చెప్పింది కూడా నిజమే. ఏ ఉద్యోగం చేసేవాణ్ణయినా చేసుకోవడానికి నాకభ్యంతరం లేదుగానీ, ఆ పెళ్లీ, ఆ మనిషి ఉద్యోగం నా గమ్యానికీ, జీవితానికీ అడ్డంకులు కావడం నాకిష్టంలేదు. వాటన్నిటి కన్నా ముందు... ఇలాంటి పెళ్లితంతు నాకు మరీ అన్యాయంగా తోస్తోంది. పెళ్లికోసం మరీ ఇంత రాజీపడాలా... అది లేకుండా బతకడమే సుఖంలా ఉంది... బతగ్గలిగితే!''

మిగతా మిత్రులంతా రావటంతో ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది. నిజానికి ఆ తర్వాత మరెప్పుడూ కూడా వాళ్ల మధ్య ఆ సంభాషణ రాలేదు!

ఆరోజు సాయంత్రం నందిని ఇంటికి వెళ్లేసరికి తల్లీతండ్రీ టీవీ ముందు కూర్చుని ఉన్నారు. నందిని నేరుగా వెళ్లి టీవీ ఆపేసింది. తల్లీ తండ్రీ ఏమిటన్నట్టుగా చూశారు.

నందిని మాట్లాడకుండా బ్యాగ్‌లోంచి పెళ్లి రెస్యూమ్ తీసి తండ్రికిచ్చింది. ''ఏమిటిది?'' అడిగింది ఆవేశాన్ని, కోపాన్ని దాచుకునే ప్రయత్నం చేస్తూ.

''సంబంధాలు చూస్తున్నామని తెలుసుగా,'' అన్నాడు తండ్రి.

''సంబంధాలు చూట్టం అంటే ఇలాగా? నాకింత వరకూ ఏ పెళ్లికొడుకు రెస్యూమ్ నువ్వు చూపించలేదు,'' అంది నందిని.

''నందూ! నీకు తెలిసి మాట్లాడతావో తెలియక మాట్లాడతావో ఒక్కోసారి అర్థంకాదు. నిన్ను అడిగి నీ ఇష్టంతోనే సంబంధాలు చూస్తున్నాను. అమ్మాయిలవి ఇలా రెస్యూమ్‌లు పంపడం, పెళ్లికొడుకులు షార్ట్‌లిస్ట్ చేసి పెళ్లిచూపులు చూడ్డం ఇప్పటి పద్ధతి. ఈ సంగతి నీకు తెలీదంటే నేన్నమ్మను,'' అన్నాడు తండ్రి.

''సరే నాన్నా ఆ సంగతి నాకు తెలుసు నిజమే... ఎందుకో నాదాకా వస్తుందనుకోలేదు. ఇలాటి పెళ్లి నాకక్కర్లేదు. ఎవరో ముక్కూ మొహం తెలీనివాళ్లు నా ఫోటోనీ ఇంకో ఫోటోనీ పక్కనపెట్టి లెక్కలు వేసుకోవటం, లొట్టలు వేసుకోవటం నేను భరించలేను. అది కూడా అలాటి అవకాశం నాక్కూడా లేకుండా. ఎలాగూ నా అందానికి ఏ రాకుమారుడూ దిగిరాడు. ఈ ప్రయత్నాలు ఆపేసి, ప్రస్తుతానికి నన్ను చదువు మీదా ఉద్యోగం మీదా మనసు పెట్టనీ. ప్లీజ్, పెళ్లి అంత అత్యవసరమైన విషయంగా అనిపిస్తే అప్పుడాలోచిద్దాం,'' చెప్పింది నందిని.

''అదేమిటే ఏ ప్రయత్నం లేకుండా పెళ్లెట్టా ఔతుంది. ఒకళ్ల గురించి ఒకళ్లకి తెలియకుండా సంబంధాలెట్టా కలుస్తాయి? పాతకాలంలో ఉత్తరాలు రాసేవాళ్లు. మా నాన్న పదిహేను పైసల కార్డుముక్కలు రాయటం నాకిప్పటికీ గుర్తు. కాలం కాస్త మారిందంతే... అలా గింజుకుంటే ఎలాగే'' అంది తల్లి నచ్చచెబుతున్నట్టుగా.

నందిని నోరు విప్పేలోగానే అన్నాడు తండ్రి...

''అది మారినకాలం గురించి కాదు అడుగుతోంది. మారని కాలం గురించి. నీ ఇష్టం నందూ. పద్ధతి ప్రకారం తండ్రిలా నా బాధ్యత నెరవేర్చమంటే అన్నీ చేస్తాను. నేను పెద్దదాన్నయ్యానూ నా మంచి చెడ్డలు నాకు తెలుసు అనంటే... అది కూడా నేనొప్పుకుంటాను,'' అని బయటకెళ్లబోతూ ఆగి వెనక్కి తిరిగి...

''నందూ మర్చిపోకు. చలం పుట్టింది మీ తరంలో కాదు. మా తరంలో. నీకు ఏ తేడా లేకుండా చదువు చెప్పించడంతోనూ, నీ కాళ్ల మీద నువ్వు నిలబడేట్టుగా చెయ్యడంతోనూ నా పని అయిపోయింది. నువ్వు లోకంలో కల్సిపోతావో, నచ్చనివాటికి ఎదురు తిరుగుతావో నువ్వే నిర్ణయించుకోవాలి. నీ తరపున ఆ యుద్ధం చెయ్యాల్సిన పని నాదికాదు,'' పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్లిన తండ్రి వైపు విస్మయంగా చూసింది నందిని.

నందినికి తెలుసు తండ్రి ఎంత ఆవేశపరుడో. తన ధైర్యానికీ వ్యక్తిత్వానికీ ఆదీ అంతం అన్నీ తన తండ్రిలోనే అని ఆమెకి తెలుసు.

''పర్యవసానం ఆలోచించకుండా ఏమిటా దూకుడు... ఈ దారిన వెళితే ఏం జరగ్గలదో ఆలోచించడానికే నాకు భయంవేస్తోంది. మీకిద్దరికీ అసలు ముందాలోచనే ఉన్నట్టు లేదే,'' అంది తల్లి, భర్తకి వినిపించదని తెలిసీ.

''నువ్వున్నావు కదే అన్నీ ఆలోచించడానికి'' కొంత నిర్లక్ష్యంగా కొంత ఏడిపిస్తున్నట్టుగా అంటూ తల్లి పక్కనే కూర్చుని గారాబంగా చేతుల్తో చుట్టేసింది నందిని.

''హు... తెలుస్తుందే... అమ్మ కూడా ఆలోచించగలదని. విషయం వచ్చినప్పుడు నీకే తెలిసొస్తుంది. అమ్మ విలువేమిటో'' అంది కూతురి తలమీద ప్రేమగా చేయివేసి.

### 3

ఆలోచనల్లోంచి ప్రయత్నం మీద బయటపడి, స్నానం ముగించి త్వరత్వరగా తయారయింది నందిని.

ఇద్దరూ కలిసి బయటికి నడిచారు. కారు బయల్దేరిందాకా ఎవరూ మాట్లాడలేదు. ఆలోచనల బరువులోంచి నందిని ఇంకా బయటపడలేదని మార్క్‌కి తెలుస్తోంది. ఆమెని అలానే వదిలేయాలో లేక మాట్లాడించాలో ఓ నిమిషం అర్థం కాలేదు. మెల్లగా అన్నాడు.

"ఇంట్లో అంతా బానే ఉందిగా. నువ్వు ఫోన్లో మాట్లాడినప్పట్నించీ చూస్తున్నా... ఏదో అప్సెట్ అయినట్టు కనబడుతున్నావు... ఏమైనా..." కొంత సందేహిస్తూనే అడిగాడు.

నందినికి అర్థమయింది. ఫోన్లో గొంతు పెంచి మాట్లాడ్డం వినబడి ఉంటుంది. తన ప్రవర్తన అంత సులభంగా అర్థమయ్యేలా ఉంటుందా అని ఆశ్చర్య పడింది.

"వెల్! పాత సంగతే. నా పెళ్లి కాలేదని మా అమ్మ దిగులు. అది సమస్యే కాదు, నేను హాయిగా ఉన్నా నన్నా వినదు. అది మా పద్ధతి... ఎంతయినా రాజీ పడాలి... అమ్మాయి అంటే ఎవడూ ఎలాటివాడూ అన్నది అనవసరం, ఎవడో ఒకడితో పెళ్లి అయిపోవా లంతే. అలా కాని అమ్మాయి ఇంట్లోనూ, ఊళ్లోనూ అందరికీ సమస్యే."

మార్క్ వెంటనే మాట్లాడలేదు. తనకి ఇంతకు ముందే ఈ విషయాలు కొంతవరకూ తెలియడం వల్ల పెద్ద ఆశ్చర్యపోలా. సంవత్సరం క్రితం ఇలాంటివి మొదటిసారి వింటున్నప్పుడు ఉన్న కుతూహలం, విస్మయం కూడా పోయాయి మనిషిలో.

"కమాన్ నందూ! సుధాకర్ వాళ్లమ్మ కూడా అతన్ని తొందరగా పెళ్లి చేసుకోమని గొడవ పెడ్తోందిట. ఇండియా వెళ్లటమే వాయిదా వేసుకుందామను కుంటున్నాడు ఆ గోల భరించలేక. నువ్వనవసరంగా మీ అమ్మని అనుమానిస్తున్నావేమో. నువ్వు అబ్బాయి వైనా మీ అమ్మ ఇలాగే అడిగి ఉండేదేమో."

మార్క్ వైపు ఆశ్చర్యంగా చూసింది నందిని, ఎంత త్వరగా ఆలోచించగలడు ఈ మనిషి అని. మెల్లగా అంది...

"బయట నించి చూస్తే అలాగే ఉంటుంది మార్క్. మా దేశపు మధ్యతరగతి బతుకుల్లో ఉండే కాంప్లెక్సిటీ అంత సులభంగా అర్థమయేది కాదు. ఆ రెంటికీ తేడా ఏమిటంటే... సుధాకర్ పెళ్లి ఆలస్యమైతే అతడు చేసుకోలేదు అని అర్థం. నా పెళ్లి ఆలస్యం అయితే నాకు పెళ్లి కాలేదూ అని అర్థం. ఈ రెంటికీ తేడా అర్థమయితే మిగతావి అర్థమవుతాయి."

"నిజమే! నేనివి అర్థం చేసుకునే ప్రయత్నమే చేయకూడదు," అంటూ సంభాషణలోంచి బయటపడ టానికి కారు రేడియో ట్యూన్ చేయడం మొదలు పెట్టాడు.

నందిని కూడా ఓ నిమిషం ఏమీ మాట్లాడకుండా డ్రైవ్ చేసింది. సడన్‌గా అడిగింది.

"కాథీ ఎలా ఉందో తెలుసా ఏమన్నా."

అకస్మాత్తుగా కాథీ ఎందుకు గుర్తుకు వచ్చిందో అర్థంకాలేదు మార్క్‌కి. కాథీ ఆర్నెల్ల క్రితం దాకా మార్క్ గర్ల్‌ఫ్రెండ్.

నందిని కొంచెం సర్దుకుంటున్నట్టుగా, "పక్క కార్లో అమ్మాయి కాథీలా కనబడితే గుర్తొచ్చి అడిగాను," అంది.

"ఏమో నాకేం తెలీదు. చికాగో వెళ్లింది నాలుగు నెల్ల క్రితం. స్కూల్లో చేరినట్టుంది. వెళ్లే ముందు ఇ-మెయిల్ పంపింది. తర్వాత తెలీదు," అన్నాడు ముక్త సరిగా.

వాళ్లిద్దరి స్నేహం, సంబంధం, చివరికి విడిపో వడం అన్నీ వింతగా తోస్తాయి నందినికి ఇప్పటికీ. ఆమె దృష్టిలో వాళ్లిద్దరిలో ఎక్కడా పొంతన లేదు. మార్క్ తెలివితేటలకీ, కష్టపడేతత్వానికీ... కాథీ అల్లరి చిల్లర తనానికీ లంకె ఎలా కుదిరిందో ఆమెకి ఇప్పటికీ అర్థం కాదు. 'ఆడది అందంగా ఉంటే చాలా ఏ మగాడి కయినా? అయ్యుండాలి,' అనుకుంది... ఆఫీసులో పని జీవన్మరణ సమస్యగా మారి తిండీతిప్పలు మానేసి అందరూ పనిచేస్తున్నప్పుడు మార్క్‌తోటి కాథీ విడిపో యింది. "వారాంతాలూ, సాయంత్రాలూ కూడా కలవ లేని బాయ్‌ఫ్రెండ్ ఎందుకు, ఫోటోఫ్రేములో చూసుకో డానికా?" అని అంటూ.

"ఒంటరితనం కొంచెం కష్టమైనదే. ఎంత రాజీ పడ్డా, దేంట్లో రాజీపడ్డా తోడు దొరుకుతుందంటే తప్పు లేదనుకుంటా," అనద్దనుకుంటూనే అన్నాడు మార్క్.

పెద్దగా ఆశ్చర్యపోలేదు నందిని. మార్క్ ఎలా పెరిగాడో నందినికి తెలుసు. అతను చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నాడు. ఆయన రోడ్డుమీద నడుస్తూ, ఎవరో ఎవర్నో కాలిస్తే రేగిన తూటాలకి అన్యాయంగా బలయిపోయాడు. తెలిసీ తెలియని వయసులో జరిగిన ఆ దుర్ఘటన ఇప్పటిదాకా మార్క్‌ని వెంటాడుతూనే వుంది. తల్లి అతి కష్టం మీద పెంచింది మార్క్‌ని, అతని చెల్లెల్నీ. మార్క్‌కి పదేళ్ల వయసున్నప్పుడు వాళ్లమ్మ రెండో పెళ్లి చేసుకుంది. సవతి తండ్రి మంచివాడే అయినా

మార్క్ అతనితో కలవలేకపోయాడు. అవసరానికి మించిన ఒంటరితనాన్ని చిన్నప్పట్నించీ మోసిన అనుభవం అతనిది. అవకాశం దొరగ్గానే ఇంట్లోంచి బయట పడి సొంత సంపాదనతో చదువు పూర్తిచేసి ఇంత వాడయ్యాడు.

నందిని ఆలోచనలో పడింది. ఎంత తేడా ఇద్దరిలో! రాజీపడ్డం ఇష్టంలేక, తనని తాను గుర్తించుకోవడం కోసం ఒంటరితనాన్ని మోస్తున్నది ఒకళ్లు. ఒంటరితనాన్ని భరించలేక ఏ రాజీ అయినా పడ్డానికి సిద్ధంగా మరొకరు!

"రాజీపడ్డానికి కూడా ఓ హద్దుంటుంది మార్క్. సాహచర్యం వేరు, బానిసత్వం వేరు. తోడుకోసం నిన్ను నువ్వే మర్చిపోయి బతుకంతా ఈడ్వాలంటే ఒక్క మా దేశపు ఆడజాతికి తప్ప ఎవరివల్లా అవదు. అక్కడ కూడా వాళ్లు తోడు కోరుకుని కాపురాలు చేస్తున్నారా అన్నది నా కనుమానమే. అంతకన్నా ముఖ్యమైన నిత్యావసరాలు వాళ్లని నడుపుతున్నాయని నా అనుమానం. పెళ్లి తప్ప బతకటానికి మరో ఆధారం లేకపోవడం వల్లనే," అనకుండా ఉండలేకపోయింది నందిని.

ఎంతవరకూ అర్థమైందో తెలీదుకానీ, మార్క్‌కి ఇంకా ఆ విషయం గురించి మాట్లాడ్డం ఇష్టం లేకపోయింది. ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాడు.

కారు మెల్లగా హోటల్ చేరింది. ఇద్దరూ దిగి పార్టీ జరిగే కాన్ఫరెన్స్ హాల్‌కి చేరారు. మధ్యాహ్నం దాకా వున్న ఉత్సాహం మళ్లీ ఒక్కసారి వచ్చేసింది. కొలిగ్స్‌తో మాట్లాడుతూ, జోకులు వేస్తూ హుషారుగా ఉన్న వాతావరణంలో ఇద్దరూ తమని తాము మరిచిపోయారు.

కంపెనీ ఛైర్మన్ మాట్లాడాడు. రాబోయే రోజులు ఇంకా కష్టమవుతాయనీ, ఇంకా చాలామందిని కంపెనీలో చేర్చుకోవాలనీ, చిన్న కంపెనీ పెద్దదిగా మారే క్రమంలో కొన్ని సరదాలు కోల్పోవాల్సొస్తుందనీ అన్నాడు.

నందినికి పొద్దున్నే చెప్పారు. త్వరలో ఆమెని డెవలప్‌మెంట్‌కి డైరెక్టర్ చేస్తారనీ, ఎవర్ని టీంలోకి తీసుకోవాలో, ఎలా మానేజ్ చేయాలో అంతా ఆమె చేతిలోనే ఉంటుందనీను. చిన్న కంపెనీలో అందరూ ఇంతకాలం స్నేహితుల్లా చేసిన పనికి రాబోయే కాలంలో చేయబోయే పనికీ చాలా తేడా ఉండబోతోందని అర్థమయింది నందినికి. ఇప్పట్నించి గిరిగీసిన అధికారాలూ, ఖచ్చితమైన బాధ్యతలు ఉండబోతున్నాయన్నమాట అనుకుంది.

నందిని మిగతా గ్రూప్‌తో కలిసి మాట్లాడ్డం మొదలుపెట్టింది. పార్టీ మొదలయ్యాక ఎప్పుడూ ఒకచోట ఉండడు మార్క్. మనుషులు కనబడితే చాలు ఒళ్లు మరిచిపోతాడు. చేతిలో బీర్‌బాటిల్, ఎదురుగా వినేందుకు ఓ మనిషీ ఉంటే చాలు ఎంతసేపైనా మాట్లాడుతూనే ఉండగలడు.

మెల్లగా పార్టీ చివరి దశకి వచ్చింది. ఒక్కొక్కళ్లూ వెనుదిరగడం మొదలుపెట్టారు. నందినికి కూడా ఇక కదిల్తే బాగుణ్ణనిపించింది. మార్క్‌ని వెతికి పట్టుకుంది. ఇంటికి వెళ్దామా అంటే సరేనన్నాడు. ఇద్దరూ లేచి అందరికీ బై చెప్పి హోటల్ బయటకి నడిచారు.

ఇల్లు చేరేటప్పటికి మరో గంట గడిచింది. మార్క్ ఇవ్వాళ అక్కడే సోఫాలో పడుకుని పొద్దున్నే వెళ్తాడనేది ఇద్దరికీ తెలిసిన సంగతే. ఇద్దరూ మాట్లాడకుండా అపార్ట్‌మెంట్ తలుపు తీసుకుని లోపలికి నడిచారు.

మార్క్ నేరుగా వెళ్లి సోఫాలో కూలబడ్డాడు. నందిని బట్టలు మార్చుకోవడానికి లోపలికి వెళ్లాలనుకుంది.

"నందూ! నీకో సంగతి తెలుసా?" అన్నాడు మార్క్.

"ఏమిటి?"

"నీ కళ్లలో అసలు భయమనేదే కనపడదేం? నీకు దేని గురించీ దిగులు ఉండదా? ఎప్పుడన్నా కనపడితే కోపం కనపడుతుంది తప్ప దిగులు కనపడదు. ఆ నిశ్చింతే ఎంత అందంగా కనపడుతుందనుకున్నావ్" అన్నాడు.

"ఎంత తాగావ్ ఇవ్వాళ?" అంది వస్తున్న నవ్వుని ఆపుకుంటూ.

మార్క్ సోఫాలోంచి లేచాడు. నేరుగా నందిని దగ్గరగా వచ్చి, ఆమె తేరుకునేలోగా నడుం చుట్టూ చెయ్యి వేసి, దగ్గరికి లాక్కుని పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు.

నందిని విస్తుపోయింది. మొదటి అనుభవం అయినా ఆమెకి అసహజంగా అనిపించలేదు. అతడి పరిచయంలో ఆమెకి తెలియకుండానే ఏర్పడిన నమ్మకమో, సాన్నిహిత్యమో, వ్యామోహమో, దాహమో... ఆమె అడ్డు చెప్పలేదు.

ముందు ఓ అడుగు వెనక్కి వేసి, అంతలోనే మళ్లీ ముందుకు వచ్చి, అతణ్ణి గట్టిగా కౌగిలించుకుని, గుండెల మీద తల పెట్టి కళ్లు మూసుకుంది.

## 4

ఆకాశం మబ్బు పట్టి ఉంది. సన్నగా తుంపర కూడా పడుతోంది. ఫ్రీవే అంతా నిండిపోయి కదలట్లేదు. ఈ ట్రాఫిక్‌లో ఎయిర్‌పోర్ట్ చేరడానికి గంటపైగా

పట్టేట్టుగా ఉందనిపించింది నందినికి. ఇంటర్నేషనల్ టర్మినల్ నుంచి బయటపడ్డానికి చాలా టైం పడుతుంది కాబట్టి పర్లేదులే కానీ, గంటపైగా ఇంకా ఈ టెన్షన్ అనుభవించాలా అనుకుంది. తాను చెప్పబోయే వార్తకి తల్లీతండ్రీ ఎలా స్పందిస్తారో అంచనా వేయలేక సతమతమవుతోంది. ముందుగా అన్ని సంగతులూ చెప్పి రమ్మనకపోవడం తప్పేమోననిపించింది ఒక్క క్షణం ఆమెకి.

అప్రయత్నంగా కుడిచెయ్యి స్టీరింగ్ మీద నించి తీసి పొట్ట తడువుకుంది. అర్థం చేసుకోగలదనుకున్న మాధవే జీర్ణం చేసుకోలేకపోయింది. నెలరోజుల క్రితం వెళ్లింది ఒకసారి. నందిని కొన్న కొత్త పెద్ద ఇల్లు, కార్లు అన్నీ చూసి శభాష్ అంది.

ఓ రెండు రోజుల తర్వాత అడిగింది, "నువ్వు మార్క్‌ని పెళ్లి చేసుకోలేదు కదా," అని.

"చేసుకుంటే నీకు చెప్పనా," అంది నందిని.

"నిజం నందూ... నువ్వెవరో తెల్లతనితో కలిసి ఉంటున్నావంటే ఏదో పుకారేమో అనుకున్నాను. నిన్నిలా చూసిందాకా నమ్మలేదు నేను," అంది మాధవి.

"నీకోసంగతి ఇంకా చెప్పలేదు నేను... నాకిప్పుడు మూడోనెల... తల్లిని కాబోతున్నాను," నువ్వనుకున్న దానికంటే ఎక్కువ దూరమే వెళ్లాను అన్నట్టు ధ్వనించేలా తిక్కగా చెప్పింది నందిని.

"నిజమా... కంగ్రాట్స్," అని ఆగి, "కంగ్రాట్స్ చెప్పొచ్చా.. ఇదంతా కావాలని తెలిసే చేస్తున్నావో... మరోటో తెలీకుండా ఉంది," అంది మాధవి.

ఒక్కక్షణం ఆగింది మాధవి.

"మధూ... నీతో కాబట్టి ఈ సంభాషణ ఇంత దూరమన్నా రానిచ్చాను. పెళ్లిని ఇలా అవసరాల జాబితాలో చేర్చింది నేను కాదు, జాగ్రత్తగా ఆలోచించు. పెళ్లిని ఓ వ్యవస్థ అనుకుంటే, ఉన్న వ్యవస్థని నేనంగీకరించలేను. అవసరం అనుకుంటే... ఆ అవసరాలన్నీ నేను సమకూర్చుకున్నాను. అవును, ఆకలి, దాహం లాగానే సెక్స్ కూడా నాకు అవసరమే... దీనికి ఎవరేం పేరు పెట్టుకున్నా నాకభ్యంతరం లేదు," గుక్క తిప్పుకోకుండా చెప్పింది.

మాధవి ఇంకేం మాట్లాడలేదు... సంభాషణ పెంచడం ఇష్టంలేకనో ఏమో!

నందినే అంది.

"మాధవీ, నేను ఈ సిస్టం నుంచి ఏమీ ఆశించట్లేదు. ఈ సిస్టంని ఎదిరించాలనో, మార్చాలనో కూడా నా ప్రయత్నం కాదు. నాకంత ఓపికా తీరికా లేవు. నన్ను పట్టుకుని కట్టిపడేసి నా జీవితాన్నీ, శరీరాన్నీ, ఆలోచనల్నీ అన్నింటినీ ఎవరిష్టం కోసమో ఆడించమంటే మాత్రం కుదరని పని. నా మానాన నేను బతుకుతాను. ఆకలేస్తే తింటా, ఇష్టపడితే ఎవడితో కావాలంటే వాడితో పడుకుంటా, కావాలనుకుంటే పిల్లల్ని కంటా, లేకపోతే లేదు. నా ఒళ్లు, నా జీవితం, నా ఇష్టం."

"నువ్వింతకన్నా తెలివైనదానివనుకున్నాను. నీ వాదం, నువ్వు చేసే పని నేనంగీకరించలేకపోయినా పర్లేదు, నీకంటూ ఏదో ఓ వాదం ఉందనీ, నీకు నువ్వు సమాధానం చెప్పుకోగలవనీ నమ్మాలని నా ప్రయత్నం. టీనేజి పిల్లలా నా ఇష్టం నాది అనడం వాదం కాదు మూర్ఖత్వం. ఆ క్షణంలో ఆకలి తీర్చుకోవటమే ముఖ్యం అనుకోవటం జంతులక్షణమన్నా అవుతుంది, చిన్న పిల్లల మనస్తత్వమన్నా అవుతుంది," అని ఒక్కక్షణం ఆగింది మాధవి.

అనవసరంగా పెద్ద మాటలు మాట్లాడానేమో అని అనిపించి, అనునయంగా అంది.

"నందూ, ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లుండేదాన్ని సిస్టం అనరు. అలాంటిచోట ఎవరికీ ఏ భద్రతా వుండదు. నీకు నాకన్నా ఎక్కువే తెలుసు. నా నమ్మకం అనుకో, బలహీనతే అనుకో, మూర్ఖత్వమే అనుకో... మన దేశీ మధ్యతరగతి కుటుంబాల్లో అమ్మాయిలకి పెళ్లి వల్ల ఒక సాంఘిక భద్రత ఏర్పడింది. దాన్ని కూడా ధ్వంసం చేసేస్తే... ఇంకేమవుతుందోనని నా భయం. నువ్వు దేశం సరిహద్దులూ దాటేశావ్, మధ్యతరగతి సరిహద్దులూ దాటేశావ్... ఇవన్నీ మాట్లాడ్డం నీకు చాలా సులభం."

కొంతసేపు మౌనంగా ఉండిపోయింది నందిని. ఇద్దరి ఆవేశాలూ చల్లబడ్డాయని అనిపించాక ఆలోచనల్ని పేర్చుకుంటూ సమాధానం చెప్పింది.

"మాధవీ, నేను మొదట చెప్పిన సమాధానం నిన్ను ఉద్దేశించి కాదు, నా జీవితం మీద నాకు ఇదమిద్ధమైన ఆలోచన లేక కాదు. ఆడదెలా బతకాలనుకున్నా ముందు ఊరందర్నీ సమాధానపరచాలనుకునే మన స్త్రీత్వాలకి అది నా సమాధానం. నువ్వు అందరి తరపునా వకాల్తా పుచ్చుకున్నట్టు అడిగావు కాబట్టి దానికదే సమాధానం. నేనెవరికీ జవాబుదారీ కాదనేదే. ఇక నాకున్న సమాధానమంటే అదీ చెపుతాను, అదీ నీక్కాబట్టి..." ఒక్కక్షణం ఆగి మళ్లీ మొదలుపెట్టింది.

"నువ్వు చెప్పిందే ఆలోచించు. మధ్యతరగతి ఆడపిల్లలకి పెళ్లి వల్ల రక్షణ ఏర్పడిందన్నావు. అదలా కనబడుతుంది కానీ అది పచ్చి మోసం. ఆడదానికి పెళ్లినే పరమావధిగా చేసే కుట్ర. ఏం చదివినా చదవకపోయినా అమ్మానాన్నా తంటాలు పడి ఎవణ్ణో ఒకణ్ణి

తెచ్చి కట్టిపడేస్తారు అనటం రక్షణ కాదు... నీచమైన అవమానం. తలవంచుకుని పెళ్లిచూపుల్లో కూర్చోవాల్సి రావటం రక్షణ కాదు, దౌర్భాగ్యం. బతకడానికి మరో గతి లేకపోవటం, ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం కావాలి. సొంతంగా బతగ్గల శక్తిసామర్థ్యాలు కావాలి. అందుకు కావాల్సిన చదువూ సంధ్యలు కావాలి. అప్పుడు పెళ్లి కూడా తనిష్ట ప్రకారం తలెత్తుకుని చేసుకునే రోజొస్తుంది.''

ఇంకేదో అనేలోపు అందుకుంది మాధవి.

''కాదని నేననలేదు. కాకపోతే నువ్వన్నంత అన్యాయంగా కూడా ఏమీలేదు. నువ్వన్న మార్పులు మెల్లగానైనా వస్తూనే ఉన్నాయి. ఇవ్వాళ్టి రోజున ఇంజనీరింగ్ కాలేజీల్లో చూశావా ఎంతమంది అమ్మాయిలో! ఏ చదువుకూ నోచుకోని పెద్దవాళ్ల సంగతి వదిలేయి. మన స్థాయి మధ్యతరగతి కుటుంబాల్లో ఆడ, మగా అంతా చదువుకుంటూనే ఉన్నారు, ఉద్యోగాలు కూడా చేస్తూనే ఉన్నారు.''

ఈసారి నందిని అడ్డుకుంది.

''అక్కడే ఉంది మోసం. ఆడదానికి ఇవ్వాళ దొరుకుతున్న చదువు కూడా స్వావలంబన కోసం కాదు, పెళ్లి కోసమే. ఓ తరం ముందు నువ్విలా మాట్లాడు, సంగీతం పాడు, గిన్నెలు తోము... పెళ్లవుతుంది అన్నారు. మన అమ్మలూ, అమ్మమ్మలూ అలా తంటాలుపడ్డారు. ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ చేస్తే అమెరికా పెళ్లికొడుకు, బ్యాంకు టెస్టులు పాసైతే గవర్నమెంటుద్యోగి పెళ్లి కొడుకు అని తేల్చారు. ఈ పెళ్లి మాత్రం ఆడదాని ఏకైక గమ్యం, లక్ష్యం, మోక్షం... అప్పుడూ ఇప్పుడూ కూడా. ఆడపిల్లని పెంచడం అంటే పెళ్లికూతుర్ని తయారుచేయడమే అప్పుడయినా ఇప్పుడయినా... అందులో ఏ మార్పు లేదు.''

''సరే నందినీ, కొంత నిజమేనని ఒప్పుకుంటాను. కాని ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చేస్తే, వచ్చేస్తే సమస్యలన్నీ పరిష్కారమైపోతాయని నేన్నమ్మను. ఎంతమంది నందినీలని తయారుచేయగలం? చేసినా నీ బతుకు గాడితప్పిన బండిలానే కనబడుతుందిగానీ సమస్యకి పరిష్కారంగా తోచదు నాకు,'' అంది మాధవి.

''నీకు ముందే చెప్పాను. ఎవర్నో ఉద్ధరించే ఉద్దేశం నాకు లేదు. నా వాదమల్లా నన్ను గుర్తించని, నాకు విలువనివ్వని వ్యవస్థ పట్ల నాకు సానుభూతి, సంబంధాలు ఎందుకుండాలి అని. అవకాశం ఉన్న వాళ్లు కూడా బేలగా తలవంచుకుని రాజీపడిపోవటం ఎందుకో నాకు అర్థం కావట్లేదు,'' అంది నందిని.

''నేన్చెపుతాను ఎందుకో. నువ్వు తెగించి వ్యవస్థని ధిక్కరించేసి వచ్చేశాననుకుంటున్నావు. అది నువ్వు చెప్పిన ఆర్థిక స్వాతంత్ర్యం ద్వారా నువ్వు సాధించిన విముక్తి నీ దృష్టిలో. దాని తర్వాత ఏమిటి? నువ్వు పూర్తిగ తెగతెంపులు చేసుకోగలిగావా? గలవా? ఇంకా నీకు మాధవి కావాలి, అమ్మా కావాలి, నాన్నా కావాలి, స్నేహితులూ, బంధువులూ... అందర్నీ తెంచేసుకోగలవా? ఇండియాకు ఫోన్ చెయ్యకుండా ఒక్క నెల పూర్తిగా గడపగలవా? వీళ్లందరితో నువ్వు సంబంధాలు అలానే ఉంచుకోవాలంటే నువ్వు కొంత వీళ్లందర్నీ సమాధానపరిచి తీరాల్సిందే. ఇదే మధ్యతరగతి మనస్తత్వమంటే. దీన్ని దాటటం నీ వల్లకాదు. నువ్వొప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఇంకా వాళ్లంతా నిన్ను అంగీకరించాలనే నీ తాపత్రయం. ఎంత నేనెవరికీ సమాధానం చెప్పనూ అని బిగదీసుకు కూర్చున్నా, అన్నీ తెంచేసుకోవటం నీవల్ల కావట్లేదు.''

...మాటలకోసం వెతుక్కుంటూ ఆగింది మాధవి. మాధవి మొహంలోకి చూడకుండా వింటోంది నందిని. తన ధ్యాసలో తాను మళ్లీ మొదలుపెట్టింది మాధవి.

''అందుకే నేననేదేమిటంటే, నువ్వు చెప్పినట్టుగా నీ బతుకు నువ్వు బతగ్గలగడంతో సమస్య తీరిపోలేదు, పోదు. అది అవసరమైన మొదటి మెట్టు. అది సాధించాక పారిపోవద్దు. అక్కడే నిలబడి మనుషుల మనస్తత్వాలని ఎదిరించాలి. ఆలోచనల మీద దాడి చెయ్యాలి. అదీ విప్లవమంటే, సమాజాన్ని మార్చడమంటే. నువ్వు చేస్తున్నదేమిటి? చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మర్చిపోవడానికి దాన్ని పట్టించుకోకుండా ఉండటానికీ ప్రయత్నం చేస్తున్నావు. నా మాట నమ్ము. అదెప్పటికీ నీవల్లకాదు. ఒకవేళ అది పరిష్కారమే అనుకున్నా, అది ఎంతమందికి వర్తిస్తుంది అనేది ఇంకో ప్రశ్న,'' సాలోచనగా అంది మాధవి.

''మాధవీ, నువ్వు చెప్పిందంతా నిజమే. మొదటి సంగతి నాకు ఈ రాత్రికి రాత్రి విప్లవం తెచ్చేసి, ఈ సమాజాన్ని మార్చేద్దామనే ఉద్దేశమేమీలేదు. అలాంటిది సాధ్యం కూడా కాదు. సమాజం వ్యక్తులతో ఏర్పడింది. తమ కాళ్ల మీద తాము నిలబడగల అమ్మాయిలంతా పెళ్లికోసం తామేమీ రాజీపడమని చెప్పాలి. పెళ్లి తర్వాత తాము ఎలా బతకాలనుకుంటున్నారో చెప్పగలిగే ధైర్యం రావాలి. అప్పుడు చూడు నువ్వు చెప్పిన ఆలోచనలు వాటంతటవే మారతాయి. అది మెల్లిగా జరిగే మార్పు. దాని మీదే నా నమ్మకం,'' దృఢంగా అంది నందిని.

''సరే నందూ... కానీ వేరే ఇల్లు చూసుకోకుండా ఉన్న ఇల్లు కూల్చుకోవడం తెలివైన పనేనంటావా?'' ఆలోచిస్తూ అంది మాధవి.

"ఖచ్చితంగా... రోడ్డు మీద నిలబడితే తప్ప కొత్త ఇల్లు కోసం ప్రయత్నం చేయరు ఈ జనాలు... ఉన్న దాన్ని కూల్చడమే మొదటిపని," చివరి మాట అంటూ నవ్వేసింది నందిని... వంత కలిపింది మాధవి.

ఆ తర్వాత చాలాసేపు ఇద్దరూ మౌనంగా ఉండి పోయారు. మాధవి వెళ్లిపోయేటప్పుడు మాత్రం ప్రెగ్నెన్సీ గురించిన పుస్తకాలు కొనిచ్చి, తనకి తెలిసిన జాగ్రత్తలన్నీ చెప్పి వెళ్లింది. మాధవిలాంటి స్నేహితురాలుండటం ఎంతో గర్వంగా ఉంటుంది నందినికి. తనన్న మాట కల్లా తలలూపే స్నేహితులున్నా, మాధవి అంటేనే నమ్మకం, గౌరవం నందినికి. వెన్నెముక లేని వాళ్లతో కలవలేదు నందిని.

ట్రాఫిక్ పలచబడి కారు వేగం అందుకుంది. నందిని ఆలోచనల్లోంచి బయటపడి ఎయిర్‌పోర్ట్‌లోకి అడుగుపెట్టింది.

*

ఎయిర్‌పోర్ట్‌లో ఏమీ చెప్పకుండానే తీసు కొచ్చింది తల్లిదండ్రులని ఇంటికి. మార్క్ ఊళ్లో లేడు. కావాలనే మార్క్ ఉండడని తెలిసిన రోజుకు వచ్చేట్టుగా ప్లాన్ చేసింది.

ఓ రెండ్రోజులు విశ్రాంతినిచ్చి మెల్లిగా చెప్పొచ్చులే అనుకుంది. మూడొంతుల జీవితాన్ని మోసేసిన తల్లికి ఎక్కువసేపు పట్టలేదు... సూటిగా అడిగింది, వచ్చిన మూడుగంటల్లోనే...

"నందూ... ఇది నీ ఇల్లేనా లేక నువ్వెవరితోనన్నా ఉంటున్నావా?" అని.

ఇంక నాన్చడం మంచిది కాదనిపించింది నందినికి. తల్లి చెయ్యి పట్టుకుని తండ్రి కూర్చుని వున్న ముందుగదిలోకి తీసుకెళ్లింది.

"ఇక్కడి నా జీవితం గురించి మీకు పూర్తిగా చెప్ప లేదు. అది ఫోన్లో మీకు అర్థమయ్యేలా చెప్పలేనేమోనని భయంవేసి మీకు సూటిగా చెప్పాలనే ఇప్పటిదాకా ఆగాను... మీరు అంగీకరిస్తారో లేదో కూడా తెలీదు. ఏదైనా కానీ మీకు ఎదురుగా కూర్చుని చెప్పాలనే ఇక్కడికి రమ్మన్నాను," మెల్లగా మొదలుపెట్టింది నందిని.

"ఎవరే అతను... నీతో ఉంటున్న,ది" తండ్రి ఇక విషయానికి రమ్మన్నట్టూ, తను అప్పటికే గ్రహించేసి నట్టూ అడిగాడు.

"మార్క్... అని... నా కొలీగ్... అమెరికన్! సంవత్స రన్నరనించీ కలిసే ఉంటున్నాం... ఈ ఇల్లు కొన్నప్ప ట్నించీ... నిజానికి ఈ ఇల్లు కూడా ఇద్దరం కలిసే కొన్నాము," తలవంచుకుని అంది నందిని.

"అంటే పెళ్లి చేసేసుకున్నారా," కలిసే ఉండటం అంటే అర్థంకాకో, నమ్మటం ఇష్టంలేకో... తల్లి.

"లేదు... పెళ్లి చేసుకోలేదు. ఆ మాటే ఇంత వరకూ రాలేదు మా మధ్య," నందిని.

"ఏమిటి ఈ బతుకు నందినీ... ఎంత నిన్ను అర్థం చేసుకుందామని ప్రయత్నం చేసినా నా వల్ల కావట్లేదు. మీ నాన్న కూడా అది ఆనందంగా ఉంటే చాలదా... దాని మంచి దానికే తెలుసు అని వాదం. అందరిలా పెళ్లి చేసుకుని కాపురం చేసుకునే ఆడపిల్ల నాకెందుకు లేదో."

"నాకిప్పుడు నాలుగోనెల... తల్లిని కాబోతు న్నాను," తల్లి మాట పూర్తికాక ముందే వంచిన తల ఎత్తకుండా చెప్పింది నందిని.

ఏదో చెప్పబోయిన తల్లి ఆగిపోయింది. భర్తవంక గాభరాగా చూసింది. భర్త మొహంలో కూడా మొదటి సారి ఆందోళన కనపడింది ఆమెకి. కూర్చున్నచోట నించి లేచి మెల్లగా నందిని దగ్గరికి నడిచింది. నందిని తల మీద చేయి వేసి దగ్గరికి తీసుకుంది.

తల్లి నించి పెద్ద అరుపులూ, ఏడుపూ ఊహిం చిన నందినికి ఆ స్పర్శతో చెప్పలేనంత ఆశ్చర్యం వేసింది. ఎప్పట్నించో ఎదురుచూస్తున్నట్టుగా తల్లిని కౌగలించుకుంది పసిపిల్లలా.

"పిచ్చితల్లీ, నీ పక్క నేనున్నాగా..." అంది తల్లి గొంతు పెగుల్చుకుని.

వెచ్చటి తల్లి ఒడిలో ఇంకా ఇంకా ఒదిగిపోతూ అనుకుంది నందిని. ఇంతకు మించిన కవచం ఏముంటుంది ఎవరికైనా అని.

తన ఆలోచనల్ని తానే అర్థం చేసుకోలేక సతమత మవుతూ ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఆ తల్లీ కూతుళ్లని చూస్తూ ఉండిపోయాడు ఆ తండ్రి.

## 5

ప్రపంచంలో ఉన్న ప్రశాంతత అంతా వీడి మొహంలోనే ఉన్నట్టుంది అనుకుంది నందిని. ఎన్ని గంటలు చూసుకున్నా ఆమెకి తనివి తీరట్లేదు. నల్లటి జుట్టు, తెల్లటి ఒళ్లు, చిట్టి కాళ్లూ చేతులూ... అతి సుకుమారంగా చిన్న మొగ్గలా ఉన్నాడు. వాడి కళ్లని పరీక్షగా చూసి ఇవి పిల్లికళ్లే అని తేల్చింది నందిని తల్లి.

తల్లి పక్కనే కుర్చీలో కూర్చుని కాలక్షేపానికి ఏదో పుస్తకం తిరగేస్తోంది. నందిని తండ్రి, మార్క్ ఇద్దరూ ఇంటికి వెళ్లారు లంచ్ తేవడానికి. మొదట్లో ఉన్న సంశయం పోయింది ఇద్దరికీ మార్క్‌తో కలిసి మెలగ డానికి. మార్క్, నందిని తండ్రి ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడు

కోవడం కష్టంగా ఉన్నా ఎలాగో తంటాలు పడు తున్నారు.

తల్లిదండ్రులతో కలిసి ఒకే ఇంట్లో ఇన్ని నెలలు ఉండటానికి మార్క్ ఒప్పుకోడేమోనని పడ్డ భయం ఇప్పుడు లేదు నందినికి. కొన్ని వీకెండ్లలో బయటెక్కడో ఒంటరిగా తిరిగి రావడం, వంటగది శుభ్రంగా లేదని ఒకటి రెండుసార్లు విసుక్కోవడం తప్ప మిగతా అంతా తన పని తాను చేసుకుంటూ, సాధ్యమైనంత కలిసే మెలిగాడు. డెలివరీకి వాళ్లిక్కడే ఉంటారని నందిని చెప్పినా, "నీ ఇష్టం," అన్నాడు.

డెలివరీకి ఆస్పత్రిలో చేరిన రెండ్రోజుల్నుంచీ ముగ్గురూ కలిసే చూస్తున్నారు నందినిని. నందిని ఆలోచనలో పడింది.

బహుశా మంచి అల్లుడవటానికి అన్ని లక్షణాలూ ఉన్నాయి మార్క్‌లో. నిజానికి ఆ ఆలోచన కూడా చేసింది తల్లి. ఓరోజు సాయంత్రం పార్కులో కూర్చున్నప్పుడు కదిపాడు తండ్రి.

"నందూ, ఈ పని చెయ్యి అని చెప్పడానికి నాకు ధైర్యం సరిపోవట్లేదు. మీ అమ్మ పోరు పళ్లేక అడుగు తున్నాను. నేవెళ్లి మార్క్‌తో మాట్లాడనా మీ పెళ్లి గురించి?"

సమాధానం మెల్లిగా పేర్చుకుని అంది నందిని.

"వద్దు నాన్నా, అడిగితే నేనడుగుతాను లేదా తన డుగుతాడు. మధ్యలో మీరు కల్పించుకోవద్దు. అసహ్యంగా ఉంటుంది."

"తనడిగితే నువ్వు చేసుకుంటావా," అమ్మ ఆశగా అడిగింది.

"అవన్నీ ఆలోచించకమ్మా ప్లీజ్. పెళ్లి ఆలోచన ఇంతవరకూ లేదు. పిల్లాణ్ణి కనాలనే నిర్ణయం కూడా పూర్తిగా నాదే. తనకి నేను చెప్పను కూడా లేదు ఆ విషయం తెలిసిందాకా. నిజంగా ఆలోచించే నిర్ణయం తీసుకున్నావా అని అడిగాడు విషయం తెలిశాక. ఇప్పుడు పెళ్లి మాట ఎత్తితే ఇదంతా నేనేదో కావాలని చేసినట్టుగా ఉంటుంది. నాకు తోడు కావాలి. అందు కోసం ఓ పిల్లో పిల్లాడో ఉంటే బాగుంటుందనుకున్నాను అంతే... పెళ్లి ఆలోచన లేనేలేదు."

"అతను కూడా అదే అనుకోవచ్చు గదా... అడిగి చూడచ్చు కదా," తల్లి పొడిగించింది.

"నాకు అవసరం లేదని చెప్తున్నాను. అయినా ఇప్పుడు నేను పెళ్లి చేసుకోవడం అంటే ఏమిటి? తనెలాగూ పీటల మీద కూర్చుని తాళి కడతాడనుకోను. పోనీ అదే జరిగినా... ఇప్పుడున్నట్టే ఉంటుంది లైఫ్ అప్పుడు కూడా. తన మనసు మారినా నా మనసు మారినా విడాకులు తప్పవు. ఈ లైఫ్‌కీ, ఆ లైఫ్‌కి తేడా ఏమిటో నాకు తెలీదు. మధ్యలో డైవోర్స్ లాయర్లని పోషించడం తప్ప."

"నువ్వు అమెరికా సిస్టంని కూడా దాటిపోయావ్," తండ్రి సంధించాడు వ్యంగ్యాస్త్రం.

"అదికాదు నాన్నా... పెళ్లి అనేదాంట్లో లైఫ్‌లాంగ్ కమిట్‌మెంట్, సెక్యూరిటీలాంటి వాటికోసం మీరు కనుక చూస్తుంటే అలాటివేమీ ఇక్కడ లేవని చెప్తున్నా నంతే," నందిని.

"సరే నీ ఇష్టం తల్లీ. చెప్పాగా... మీ అమ్మ పోరు పళ్లేక మొదలెట్టానంతే. నీ ఆలోచనల్ని మార్చగలనన్న నమ్మకం నాకేమీ లేదు."

ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయినా నందిని దాచిన విషయం ఒకటుంది. నందిని తన బిడ్డని కంటూందని తెలిశాక, 'పెళ్లి చేసుకుందామా,' అని అడిగాడు మార్క్. ముందుగా ఆశ్చర్యపోయినా నందిని అనుమానించింది.

ఆఫీసులో ఎవరన్నా దేశీలు మార్క్‌తో చెప్పారేమో నని... పెళ్లి కాకుండా పిల్లల్ని కనడం ఓ బ్రహ్మప్రళయం రాగలంత విషయం భారతావనిలో అని.

"నువ్వు జాలిపడో, అతి మంచితనంతోనో నన్ను పెళ్లి చేసుకోవాల్సిన అవసరం లేదు మార్క్! అలాంటి పెళ్లి కావాలనుకుంటే ఎప్పుడో చేసుకుని వచ్చుండేదాన్ని ఇక్కడికి. ముందుగా ఈ డెలివరీ నించి బయట పడదాం. ఆ తర్వాత నిజంగా మనం ఒకళ్లకొకళ్లం కమిట్ అవగలం. మనకి ఒకళ్ల తోడు ఒకళ్లకి జీవి తాంతం అవసరం అని నమ్మకం కలిగితే అప్పుడు చూద్దాం," అని తెగేసి చెప్పింది నందిని.

మార్క్ చిన్నబుచ్చుకున్నాడు బయటికి తెలిసి పోయేలా. అది తాను కాదన్నందుకు బాధపడ్డాడో, అహం దెబ్బతిన్నదో సరిగ్గా అర్థంకాలేదు నందినికి. ఓ రెండ్రోజుల పాటు ముభావంగా ఎక్కువ మాట్లాడ కుండా ఉండిపోయాడు.

తల్లీ తండ్రీ ఈ విషయం తెలిస్తే మళ్లీ కథ మొదటికి వచ్చి, మార్క్‌ని విసిగిస్తారేమోనని కావాలనే చెప్పలేదు నందిని.

పిల్లాడు లేవడంతో ఆలోచనల్లోంచి బయట పడింది నందిని. వాణ్ణి మెల్లగా లేవదీసి, "ఆకలే స్తోందా?" అంటూ స్తనాన్ని నోటికందించింది. ఆబగా తాగుతున్న వాణ్ణి పొదివి పట్టుకుని గర్వంగా చూసు కుంది.

వాడు తాగుతుండగానే వచ్చారు తండ్రీ, మార్క్. అందరికీ బ్రెడ్‌టోస్టులు చేసి తెచ్చారు. ఆలుగడ్డ కూరతో

కొన్ని, బట్టర్ చీజ్‌లతో కొన్ని. అందరికి భోజనాలు అయిపోయాక క్యాబ్ తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు తల్లీతండ్రీ.

అన్నీ శుభ్రంచేసి వచ్చి కూర్చున్నాడు మార్క్. కొడుకుని సుతారంగా తీసుకుని వళ్లో పడుకోబెట్టుకున్నాడు. నందిని చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ''ఎంత ముద్దుగా ఉన్నాడో చూడు వీడు,'' అన్నాడు.

''నిద్ర కూడా ఎక్కువే... నీలాగే!'' వెక్కిరించినట్టుగా అంది నందిని.

ఇద్దరూ నవ్వుకున్నారు.

పిల్లాణ్ణి చూస్తూనే మెల్లిగా అన్నాడు మార్క్.

''నందూ! ఎలా చెప్తే నమ్ముతావు నువ్వు! నువ్వు లేకుండా నేను బతకలేనని చెప్పి బతిమిలాడుకోవాలా? నేన్నిన్ను నిజంగానే పెళ్లి చేసుకోవాలనుకున్నాను. వీడు పుట్టడం మూలంగానే కాదు. నీకు నీ మీదే నమ్మకంలేదు. నిన్నెవరూ నిన్ను నిన్నుగానే పెళ్లి చేసుకుంటానని అడుగుతారన్న నమ్మకాన్ని పోగొట్టుకున్నావు. నిజమే. నువ్వు లేకపోయినా, నిన్నూ, ఈ చంటాణ్ణి ఇలాగే వదిలేసి వెళ్లిపోయినా నేను బతగ్గలను. కాకపోతే కలిసే బతకాలని అనుకుంటున్నాను. ఇక నిర్ణయం నీది. మీ కుటుంబాన్ని చూశాక, పెళ్లి చేసుకోకుండా మాత్రం నేను నీతో ఇక ఉండదల్చుకోలేదు... ఇక నీ ఇష్టం,'' అంటూ కుర్చీలోంచి లేచి బిడ్డని జాగ్రత్తగా నందిని పక్కన పడుకోబెట్టి, జేబులోంచి చిన్న పొట్లాం తీసి నందినికి అందేట్టుగా మంచం మీద వదిలి బయటికి వెళ్లిపోయాడు.

నందిని కూర్చున్నచోట అలాగే రాయిలా ఉండిపోయింది. ఓ నిమిషం తర్వాత మెల్లిగా మార్క్ వదిలి వెళ్లిన పాకెట్ తెరిచి చూసింది. అందులో చిన్నడబ్బా, ఆ డబ్బాలో చక్కటి డైమండ్ రింగ్ ఉన్నాయి. ఆ ఉంగరాన్ని చేతిలోకి తీసుకుని వెనక్కి వాలి కళ్లు మూసుకుంది.

ఆమెకి తనకి తానే అర్థంకాకుండా పోతున్నాననిపించింది. తన పంతం ఎవరితోనో దేని గురించో కూడా తెలీట్లేదు. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు. ఇంతలో ఫోన్ మోగింది. ఇంటి నించి తండ్రి.

''నందూ! ఈపాటికి మార్క్ నీకు రింగ్ ఇచ్చేసి ఉంటాడు. నాకెప్పుడో చెప్పాడు. మీమధ్య జరిగిందంతా. నన్ను సలహా అడిగాడు. నన్నేమీ అడగద్దని చెప్పాను. తనే చెప్పాడు, నీకు మరోసారి ప్రపోజ్ చేస్తానని. నువ్వు మళ్లీ మేమేదో అతన్ని బతిమిలాడి పంపించామని అనుమానంతో కాదంటావేమోనని చెప్తున్నాను. ఇందులో మా ప్రమేయం ఏమీలేదు. నీ నిర్ణయం నువ్వు తీసుకో. జరుగుతున్న దానికి మేము నిశ్శబ్ద సాక్షులం మాత్రమే,'' తండ్రి గొంతులో కొంత విసుగూ, అసహనమూ ధ్వనించాయి.

మరో మాట మాట్లాడకుండా ఫోన్ పెట్టేశాడు తండ్రి.

నిశ్శబ్దంగా, ఒంటరిగా హాస్పిటల్ గదిలో... తాను వలచిన వంటరితనం... తన కొడుకుతో సహా. ఎవ్వర్నీ తన తరఫున ఆలోచించనివ్వని, ఓ సలహా కూడా ఇవ్వలేనంతగా దూరం చేసుకున్న తన నైజాన్నీ, వ్యక్తిత్వాన్నీ తానే నెమరువేసుకుంది. తానిప్పుడు గెలుస్తున్నట్టా, ఓడిపోతున్నట్టా? మాధవి ఏమనేదో ఇప్పుడుంటే అని ఆలోచించకుండా ఉండలేకపోయింది.

అయినా గెలుపు ఓటములు ఆటల్లోనో, పోటీల్లోనోగానీ జీవితంలోనా? జీవితంలో జీవించడం తప్ప మిగతావన్నీ ఎందుకు?

అప్పటిదాకా చేతుల్లో అటూ ఇటూ మారుతున్న ఉంగరాన్ని అపురూపంగా వేలికి తొడుక్కుంది. పక్కన నిద్రపోతున్న కొడుకుని ముద్దు పెట్టుకుని చెప్పింది...

''ఎన్ని చెలియలి కట్టలు దాటాక దొరికిందో తెలుసా ఈ వజ్రం నాకు,'' అని.

*2003 తానా సావనీర్‌లో అచ్చయి*

*ఆదివారం ఆంధ్రజ్యోతి 13, 20 జులై 2003 సంచికల్లో పునర్ముద్రితం*

